



తల్లిదండ్రుల కమిటీలతో మాట్లాడుతున్న ఎంఎఇఒలు

'ఉగ్రదాడి'పై నిరసన హోరు

• కొవ్వొత్తులతో లౌకికవాదుల ప్రదర్శన • కూటమి ఆధ్వర్యంలో నివాళి, మౌన దీక్షలు



లౌకిక ప్రజాతంత్ర వేదిక ఆధ్వర్యంలో...

ప్రజాశక్తి - తిరుపతి టౌన్,యంత్రాంగం

పహల్గామ్ ఉగ్రదాడిని ఖండిస్తూ జిల్లావ్యాప్తంగా లౌకికవాదులు రాజకీయాలకు అతీతంగా నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. తిరుపతిలో లౌకక ప్రజాతంత్ర వేదిక ఆధ్వర్యంలో జరిగిన కొవ్వొత్తుల ప్రదర్శనలో సిపిఎం మాజీ ఎంపి పి.మధు పాల్గొన్నారు.

– శ్రీకాళహస్తిలో పలుచోట్ల నిరసనలు జరిగాయి. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య, ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి, కుమార్, వెంకటేష్, షరీఫ్, అన్వర్ బాషా కొవ్వొత్తులతో నిరసన తెలియజేశారు. ఎన్టీఆర్ భవన్ వద్ద టిడిపి సీనియర్ నేత రంగినేడి చెంచయ్య నాయుడు ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. టిడిపి బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఉమేష్ రావు ఆధ్వర్యంలో ఉగ్ర దాడిలో అమరులైన వారికి నివాళి అర్పించారు.

– తిరుపతిలో డిప్యూటీ మేయర్లు ముద్రనారాయణ, ఆర్‌సి మునికృష్ణ ఆధ్వర్యంలో నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద నివాళి అర్పించారు. వసుధైక కుటుంబంగా జీవిస్తున్న భారతీయులపై మతం పేరుతో దాడి చేయడం హేయమైన చర్యన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఎస్‌కెబాబు, నరసింహ ఆచారి, నరేంద్ర, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, అదనపు కమిషనర్ చరణ్‌తేజ్‌రెడ్డి పాల్గొన్నారు. – జనసేన నాయకులు మౌన నిరసన వ్యక్తం చేశారు. జనసేన కార్పొరేటర్లు ఎస్‌కెబాబు, నరసింహాచారి, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

– బిఎన్ కండ్రిగ బస్టాండ్ ఆవరణలో జనసేన ఆధ్వర్యంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి కొప్పల లావణ్యకుమార్, మండల అధ్యక్షులు బాషా, చిరంజీవి యాదవ్, రూపేష్ ఆధ్వర్యంలో మౌనదీక్ష చేపట్టారు.

– టిటిడిపరిపాలనా భవనం వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతామోహన్ మాట్లాడుతూ కాశ్మీర్లో ఉగ్రవాదుల చర్యలను కాంగ్రెస్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. యార్లపల్లి గోపి, రవి, తేజోవతి పాల్గొన్నారు.

– చంద్రగిరిలో జనసేన ఇన్‌ఛార్జి దేవర మనోహర ఆధ్వర్యంలో మౌనదీక్ష చేపట్టారు. రవికిషోర్, దూది జశ్వంత్, పగడాల యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్‌కు సాదర స్వాగతం



కావలి వెళ్లి వస్తున్న పవన్‌కల్యాణ్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్

రేణిగుంట : పహల్గాం టెర్రరెస్ట్ ఎటాక్ దుర్ఘటనలో అశువులు బాసిన కావలిలోని మధుసూధన్‌రావు పార్థివ దేహానికి నివాళి అర్పించి, వారి కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం విశాఖపట్నం వెళ్లే నిమిత్తం రేణిగుంట విమానాశ్రయానికి డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ చేరుకున్నారు. కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, అడిషనల్ ఎస్‌పి రవి మనోహర్ ఆచారి, శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి సాదర స్వాగతంపలికారు. పవన్‌కల్యాణ్ విమాన మార్గంలో విశాఖ పట్టణానికి ప్రత్యేక విమానంలో బయల్దేరి వెళ్లారు.

తిరుమలలో భద్రతా దళాల మాక్ డ్రిల్

ప్రజాశక్తి -తిరుమల

కాశ్మీర్ లోని పహల్గామ్ ప్రాంతంలో ఉగ్రదాడి నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తగా తిరుమలలో ఉగ్రవాదులు చొరబడినప్పుడు ఎలా ఎదుర్కోవాలి, భక్తులను ఎలా రక్షించాలి అనే విషయాలను లేపాక్షి సర్కిల్ వద్ద ఉన్న సుదర్శన్ సత్రంలో గురువారం సాయంత్రం భద్రతా దళాల మాక్ డ్రిల్ ద్వారా చేసి చూపారు. అదనపు ఎస్పీ రామకష్ణ ఆధ్వర్యంలో ఉగ్రదాడి జరిగినప్పుడు ఎలా వ్యవహరించాలనే అంశంపై టీటీడీ నిఘా, భద్రతా, సివిల్ పోలీసులకు, రిజర్వు పోలీసులకు, ఆలయ సిబ్బందికి, వైద్య సిబ్బందికి క్షుణ్ణంగా వివరించారు. అసాల్ట్ డాగ్ ఎనిమీ ఎటాక్, రూమ్ ఇన్టర్వెన్షన్ కార్యకలాపాలు చేసి చూపారు. దాదాపు ఒకటిన్నర గంటపాటు ఈ మాక్ డ్రిల్ కొనసాగింది. ఈ మాక్ డ్రిల్ 28 మంది ఆక్టోపస్ కమాండోలు, 25 మంది టీటీడీ విజిలెన్స్ సిబ్బంది, 15 మంది పోలీసులు, 10 ఏపీఎస్పీ సిబ్బంది ఈ మాక్ డ్రిల్ లో భాగమయ్యారు. ఈ కార్యక్రమంలో వీజీవోలు రామ్ కుమార్, సురేంద్ర, డీఎస్పీ విజయ శేఖర్, ఏవిఎస్ఓలు, పోలీసు, ఆక్టోపస్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.



ఉగ్ర దాడుల నేపథ్యంలో తిరుమలలో మాక్‌డ్రిల్

విలీనం 'వెనక్కి'..!

పోరాడి గెలిచిన విద్యార్థులు
కాటూరు యూపీ స్కూల్ యథాతథం
రేపో మాపో రానున్న ఉత్తర్వులు
తల్లిదండ్రుల్లో హర్షాతిరేకాలు

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ

మోడల్ స్కూల్స్ పేరిట చంద్రబాబు సర్కారు అమలు చేస్తున్న ప్రభుత్వ బడుల విలీన ప్రక్రియపై రాష్ట్రమంతటా వ్యతిరేక పవనాలు వీస్తున్న సంగతి తెలిసిందే. కొన్నిచోట్ల తమ పాఠశాలలను కాపాడుకునేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు ఉద్యమ బాట పట్టారు. తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గం బుచ్చినాయుడు కండ్రిగ మండలం కాటూరు గ్రామస్తులూ ఇదే బాటలో నడిచారు. పలుమార్లు పాఠశాలకు తాళాలు వేసి నిరసన తెలియజేశారు. ఎంఈఓ కార్యాలయాన్ని ముట్టడించారు. డీఈఓ కు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే నుంచి ఎంపీ వరకు తమ పాఠశాలను కాపాడాలంటూ విన్నవించారు. ఎట్టకేలకు వారి ప్రయత్నం ఫలించింది. చంద్రబాబు సర్కారు విలీన ప్రక్రియ విచ్చిన్నమైంది. పాఠశాలను యధాతథంగా ఉంచేందుకు రేపో మాపో విద్యాశాఖ కమిషనర్ నుంచి ఉత్తర్వులు రానున్నాయి. ఆ మేరకు రాష్ట్ర విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ బాబు స్వయంగా హామీ ఇచ్చినట్లు విద్యార్థుల తల్లిదండ్రులు, ఎన్‌ఆర్‌ఐ గిరీష్ యాదవ్ తెలిపారు. దీనిపై తల్లిదండ్రుల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. యూపీ స్కూల్ గా ఉన్న తమ పాఠశాలను మరింత మోడరైజేషన్ చేసేందుకు తామే ఆర్థిక సాయం చేస్తామంటూ గ్రామస్తులు ముందుకు వస్తుండడం గమనార్హం. వివరాల్లోకి పోతే..

మండలంలోని కాటూరు గ్రామంలో మండల ప్రజా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఉంది. ఇక్కడ 1 నుంచి 8 తరగతి వరకు సుమారు 70 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు సర్కార్ తీసుకున్న విలీన ప్రక్రియలో ఇక్కడ 6,7,8 తరగతి విద్యార్థులను ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న పల్లమాల హైస్కూల్లో విలీనం చేసేందుకు జిల్లా విద్యాశాఖ అధికారి ఉత్తర్వులు జారీ చేశారు. కాటూరు యూపీ స్కూలును మోడల్ ప్రైమరీ స్కూల్ గా తీర్చిదిద్ది పద్మావతి పురం ప్రాథమిక పాఠశాల, ఓటివాని చెరువు ప్రాథమిక పాఠశాల, కాటూరు యానాది కాలనీ ప్రాథమిక పాఠశాలను కాటూరులో విలీనం చేసేందుకు సన్నాహాలు ప్రారంభించారు. ఇందుకు ఒప్పుకోవాల్సిందిగా ప్రధానోపాధ్యాయుల ద్వారా పేరెంట్స్ కమిటీపై ఒత్తిడి తెచ్చారు. దీంతో తిరగబడ్డ తల్లిదండ్రులు బంగారం లాంటి తమ స్కూల్ ను వదిలి ఎక్కడో ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న పల్లమాలకు తమ పిల్లల్ని ఎందుకు పంపించాలంటూ ఎదురు తిరిగారు. పోరాడారు. అంతిమంగా నైతిక విజయానికి చేరువయ్యారు.

యధాతథమే!: రవీంద్రనాథ్ ఠాగూర్, ఎంఈఓ, బుచ్చినాయుడు కండ్రిగ

కాటూరు యూపీ స్కూలును యధాతథంగా ఉంచే అవకాశాలే మెండుగా ఉన్నాయి. విలీన ప్రక్రియపై తల్లిదండ్రుల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. యూపీ పాఠశాలను యధాతథంగా ఉంచుతున్నట్లు డీఈఓ నుంచి మౌఖిక ఆదేశాలు మాత్రమే వచ్చాయి. అధికారిక ఆదేశాలు జిల్లా విద్యాశాఖ కమిషనర్ నుంచి రావాల్సి ఉంది.

భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి : సిఐటియు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్



భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం డిమాండ్ చేశారు. సంఘం అధ్యక్షులు అల్లయ్య అధ్యక్షతన తిరుపతి జిల్లా కలెక్టరేట్ ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. జి బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ గతంలో టిడిపి ప్రభుత్వం చలివేంద్రాల పేరట 350 కోట్లను అదేవిధంగా ఇన్సూరెన్స్ పేరుతో 100 కోట్లను ఖర్చు చేసింది. అనంతరం వైసిపి ప్రభుత్వం కూడా 800 కోట్లను దారి మళ్ళించి భవన నిర్మాణ కార్మికుల సొమ్మును దుర్వినియోగం చేసింది. సంక్షేమ బోర్డు లోని సొమ్ము కార్మికులకే చెందాలని ఉన్న సుప్రీంకోర్టు తీర్పులను అమలు చేయకుండా ప్రభుత్వాలు మొండిగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో 1214 జీవోను తీసుకొచ్చి కనీసం క్లైములు కూడా అమలు చేయకుండా నిలిపివేయడం దుర్మార్గం అని వెల్లడించారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న భవన నిర్మాణ కార్మికులను ఏకం చేసి పోరాటాలకు సిద్ధం చేస్తామని హెచ్చరించారు. భవన నిర్మాణ కార్మికుల జిల్లా అధ్యక్షులు అల్లయ్య మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా సంక్షేమ బోర్డులో ఉన్న క్లైములను తక్షణమే విడుదల చేయాలని, అర్హులైన వారందరికీ సంక్షేమ బోర్డు ద్వారా గుర్తింపు కార్డులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి ఎండి శ్రీనివాసులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, లేనిపక్షంలో గత ప్రభుత్వానికి పట్టిన గతే ఈ ప్రభుత్వానికి పడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం కమిటీ సభ్యులు పుట్టా శంకరయ్య, రఫీ, వేణు, తిరుమల్ రెడ్డి, నరసింహులు, రాజా, శ్రీరాములు, దాసు, సిఐటియు నాయకులు మునిరాజా, హరి, శివానందం, ఈశ్వరి పాల్గొన్నారు.

యూట్యూబ్‌లో అన్నమయ్య సంకీర్తనలు : టీటీడీ ఈవో



ప్రజాశక్తి -తిరుపతి సిటీ

పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమయ్య సంకీర్తనలను ప్రజలందరికీ, ముఖ్యంగా యువతకు యూట్యూబ్ ద్వారా చేరువచేయాలని టీటీడీ ఈవో జె.శ్యామలరావు అధికారులను ఆదేశించారు. తిరుపతి టీటీడీ పరిపాలన భవనంలోని సమావేశ మందిరంలో ఈవో, వివిధ విభాగాల అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ నిపుణులతో కమిటీని ఏర్పాటు చేసి, వారి సలహాలు, సూచనలతో వేగవంతంగా సంకీర్తనలను యూట్యూబ్‌లో ఉంచేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. తిరుపతిలోని వివిధ ప్రాంతాలలో జరుగుతున్న ఇంజినీరింగ్ పనులను సకాలంలో పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా వేసవి సందర్భంగా టిటిడి స్థానిక ఆలయాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా, భక్తుల అధిక రద్దీ నేపథ్యంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై జేఈఓ వీర బ్రహ్మంకు పలు సూచనలు చేశారు. టిటిడి ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలోని వివిధ ప్రాజెక్ట్‌లలో జరుగుతున్న కార్యక్రమాలపై అధికారులతో ఆయన చర్చించారు. అనంతరం తిరుపతిలోని ఆరోగ్య విభాగం, శ్వేత, టీటీడీ కొనుగోళ్ల విభాగం, స్విమ్స్, విద్యా, వైద్యం, తదితర విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో వేద విశ్వవిద్యాలయం విసి రాణి సదాశివమూర్తి, ఎఫ్ ఎ అండ్ సిఎవో బాలాజి పాల్గొన్నారు.

'సీఎంఆర్ జ్యువెలర్స్'ను ప్రారంభించిన మీనాక్షి చౌదరి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ



తిరుపతిలో నూతనంగా ఏర్పాటు చేసిన సీఎంఆర్ జ్యువెలర్స్ ను ప్రముఖ సినీ నటి మీనాక్షి చౌదరి గురువారం ప్రారంభించారు. స్థానిక టౌన్ క్లబ్ సమీపంలో ఏర్పాటు చేసిన షోరూమ్ వద్ద ఆ సంస్థ వ్యవస్థాపకులు మాఊరు వెంకటరమణ మాట్లాడుతూ మారుతున్న ట్రెండుకు అనుగుణంగా అతిపెద్ద బంగారు ఎక్ను షోరూమ్‌ను తిరుపతిలో ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. వినియోగదారుల అభిరుచికి తగ్గట్టుగా ప్రాచీనత నుంచి ఆధునికత వరకు అన్ని రకాల ఆభరణాలు ఇక్కడ లభ్యమవుతాయి అన్నారు. తమ షోరూమ్ లో బంగారు నగలపై అతి తక్కువ తరుగు 3 శాతం నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. వెండి రెగ్యులర్ వస్తువులపై తరుగు మజూరి లేదన్నారు. షోరూం ప్రారంభం సందర్భంగా బంగారు ఆభరణాల కొనుగోలు వి.ఏ పై 25 శాతం డిస్కౌంట్ ఇస్తున్నట్లు వెల్లడించారు. సినీ హీరోయిన్ మీనాక్షి చౌదరి మాట్లాడుతూ సిఎంఆర్ షోరూం లో సర్ కొత్త డిజైన్తో కూడిన ఆవరణలో అందుబాటులో ఉన్నాయని, అన్ని రకాల వారు మెచ్చే విధంగా వివిధ రకాల ఆభరణాలు ఉన్నాయన్నారు. అనంతరం షోరూమ్ మొత్తం కలయ తిరిగి, అభిమానులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పులివర్తి నాని, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టిటిడి పాలకమండలి సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి, జనసేన నాయకులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, షోరూమ్ యజమానులు మోహన్ బాలాజీ, పద్మావతి, ప్రియా హారిక, ప్రముఖ వ్యాపారవేత్తలు సాగర్, మా ఊరి శ్రీనివాసు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



'ఉన్నోళ్ల దయతో రాష్ట్రంలో 30 లక్షల కుటుంబాలకు పేదరికం నుంచి విముక్తి కలిగిస్తామని' రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఉగాది పండుగ పురస్కరించుకుని 'పి 4' పథకాన్ని ప్రకటించారు. పక్కనే డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ 'ఆహా..ఓహో' అంటూ చప్పట్లు కొట్టారు.. అయితే రామచంద్రాపురం మండలం సి.రామాపురం డంపింగ్‌యార్డు సమీపంలో ఉంటున్న 60 కుటుంబాల 'బంగారు గిరిజనులను' ఎవరు దత్తత తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

ఈ గూడు నాలుగు అడుగుల వెడల్పు, నాలుగు అడుగుల పొడవు, ఐదు అడుగుల ఎత్తు. ఇందులో ఏడుగురి జీవనం. నాగరాజు, గీత, శివ, క్షీర, పోలయ్య, పోలమ్మ, సుధ నివసిస్తున్నారు. తిరుపతి కార్పొరేషన్ నుంచి వచ్చే వ్యర్థాలే వీరికి ఆధారం. ఏడుగురు కష్టపడితే వారానికి వచ్చేది 2వేల రూపాయలు మాత్రమే. ప్లాస్టిక్, సీసాలు, ఇనుప కమ్మిలు చెత్తలో వెదికి అమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. ఆ చిన్న గుడారాన్నే రెండుగా విభజించుకుని చిన్నపిల్లలు పైన, పెద్దవాళ్లు కింద పడుకుంటుంటారు.



ఈ 'బంగారు' కుటుంబాలను.. దత్తత తీసుకునేదెవరు..?

20 ఏళ్లుగా చీకట్లోనే బతుకులు / వ్యర్థాలే వారికి జీవనం / జానెడు ఇంటిస్థలానికి నోచని వైనం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుపతి జిల్లా రామచంద్రాపురం మండలం సి.రామాపురం డంపింగ్‌యార్డు సమీపంలో అరుణ కాలనీ ఇది. వివిధ ప్రాంతాల నుంచి వలస వచ్చి 60 కుటుంబాల వారు వచ్చి గుడారాల్లో నివసిస్తున్నారు. తిరుపతి నగరం మొత్తం నుంచి సేకరించిన తడి, పొడి చెత్తను ఇక్కడకే తెచ్చి పోస్తుంటారు. ఈ చెత్తలో ప్లాస్టిక్, ఇనుప కమ్మీలు వెతుక్కుని అమ్ముకుని బతుకుతుంటారు. పెద్దలతో పాటు పిల్లలూ ఇదే వృత్తిలో కొనసాగుతారు. వారికి ఉపాధి హామీ పనులంటే తెలియదు. పిల్లలకు ఆధార్‌కార్డులు లేవు. దేశ జనాభాలో వీరు లెక్కల్లో లేనట్లే లెక్క. బడిలేదు. గుడిలేదు. ఇరవై ఏళ్లుగా కరెంట్ లేదు. గుడ్డిదీపాలే వెలుగు. తిరుపతి మున్సిపాలిటీ నుంచి వచ్చే వ్యర్థాల వాహనాల కోసం వీరు రోజూ నిరీక్షిస్తూ ఉంటారు. చెత్త కొండల చివరిదాకా చెత్తలోనే దేవులాడుకుంటారు. కుటుంబం మొత్తం కష్టపడినా వారానికి రూ.1500-2వేల వరకూ సంపాదన ఉంటుంది. ఇది వారి దినచర్య.



కొవ్వొత్తులే మాకు వెలుగు : గీత, గిరిజన మహిళ

మేము గిరిజనులం. మా సొంతూరు వడమాలపేట. అక్కడ ఏ పనీ లేదు. బతుకుదెరువు కోసం రామాపురం డంపింగ్‌యార్డుకు వచ్చాం. వారంలో ఏడుగురం కష్టపడితే 2వేలు చేతికొస్తుంది. వ్యర్థాల రూపంలో ప్లాస్టిక్ సామాన్లు వస్తున్నాయి. ఒకే గూడులో ఏడుగురం ఉంటున్నాం. కరెంట్ సౌకర్యం లేదు. కొవ్వొత్తులతోనే మాకు వెలుగు.

ఎండ చూసుకుంటే కడుపు నిండదు : అమల, గిరిజన మహిళ

ఎండా వానా, శుచి శుభ్రం అని చూసుకుంటే మాకు కడుపు నిండదు. తిరుపతి మున్సిపాలిటీ నుంచి వచ్చే వాహనాల్లో వ్యర్థాలే మాకు జీవనం. చిన్నపిల్లలతో సహా ఐదుగురం వ్యర్థాలు ఏరుకుని మాకు కావాల్సిన ప్లాస్టిక్, సీసాలు తీసుకుని పనికిరాని వాటిని అక్కడే పారేస్తాం.



ఇదే మా బతుకు : ముత్తు, వలస కార్మికుడు



నేను తమిళనాడు నుంచి కుటుంబ సమేతంగా వలస వచ్చాను. ఆంధ్రాలో మాకు పని దొరకలేదు. ప్రాణాలు పోగొట్టుకోలేక, గతిలేక ఈ వ్యర్థాల పని ఎంచుకున్నాం. మా ఇంట్లో ఎనిమిది మంది ఉంటాం. ఇదే పని చేస్తాం. మా బక్క బతుకులు చూసి కిలో ప్లాస్టిక్ ధర 5 రూపాయలు తగ్గించారు. ఇనపరాడ్లు వస్తే బెదిరించి తెచ్చారని భయపెడుతున్నారు. ఇదీ మా పరిస్థితి. ఆంధ్రాలో పింఛన్ రాదు. తమిళనాడులో పింఛన్ పోయింది. వ్యర్థాలతోనే మాకు జీవనం. ఎక్కడా ఓటర్ కార్డు లేదు.

రోడ్డు ప్రమాదంలో అపాచీ కార్మికుడు మృతి

ప్రజాశక్తి-సూళ్లూరుపేట

సూళ్లూరుపేట హోలీ క్రాస్ సర్కిల్ జంక్షన్ వద్ద రోడ్డు ప్రమాదంలో అపాచీ కార్మికుడు మాయారి సురేంద్ర (32) మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. దొరవారి సత్రం మండలం మోదుగుల పాలెం గ్రామానికి చెందిన మాయారి సురేంద్ర అపాచీ పరిశ్రమకు తన బైక్ పై వెళుతుండగా హోలీ క్రాస్ సర్కిల్ జంక్షన్ వద్ద ముందు వెళ్తున్న అపాచీ పరిశ్రమ బస్సు హఠాత్తుగా బ్రేకులు వేయడంతో బైక్ పై వస్తున్న సురేంద్ర బస్సును తప్పించుకోగా వెనకనే వస్తున్న మరో లారీ సురేంద్రని ఢీకొట్టడంతో ఘటనా స్థలంలోనే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మతదేహాన్ని పంచనామా నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి,కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.



మీ ఇళ్లు ఇలాగే కట్టుకుంటారా..?

అభివృద్ధి పనులపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ / ఎఇ, ఎఎస్‌డబ్ల్యు వార్డెన్‌లను మందలింపు



హాస్టల్లో నిర్మాణ పనులు పరిశీలన

ప్రజాశక్తి - దొరవారిసత్రం

మండలంలో పలు అభివృద్ధి పనులను కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఆకస్మికంగా గురువారం తనిఖీ చేశారు. దొరవారిసత్రం మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల సంక్షేమ హాస్టల్లో తనిఖీ చేశారు. ఈ హాస్టల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.40 లక్షలు విడుదలయ్యాయి. మరుగుదొడ్లు, స్నానపుగదులు, తాగునీటి సరఫరాతో పాటు భవనం పైభాగంలో స్లాబ్‌ను పరిశీలించారు. పనులు నత్తనడకన సాగడం, ఆశించిన మేర నాణ్యత లేకపోవడంపై ఎఇ కల్యాణ్‌ను మందలించారు. టైల్స్ అస్తవ్యస్తంగా ఉండటం చూసి మండిపడ్డారు. స్నానపు గదుల ప్రాంతంలోనే వరుస క్రమంలో నీటి కుళాయిలను ఏర్పాటు చేయాలని సూచించారు. లోపల ఆవరణం అస్తవ్యస్తంగా ఉండంటం చూసి సరిజేయాలని, షటిల్‌కోర్టు ఏర్పాటు చేయాలన్నారురు. ఇంకనూ పాత కాలపు పద్ధతుల్లో డ్రమ్ముల్లో నీళ్లు ఏర్పాటు చేయడం ఏమిటని ఎఎస్‌డబ్ల్యు వార్డెన్‌ను మందలించారు. వెంటనే ఆర్‌ఒ వాటర్ ప్లాంట్ సదుపాయం కల్పించాలన్నారు. విడుదలైన నిధులను సక్రమంగా సకాలంలో నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని ఈఈకి ఆదేశించారు. ఆశించిన మేర అక్కడ నిర్మాణాలు జరగకపోవడంతో కలెక్టర్ కొంత అసహనం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ కిరణ్మయి, తహశీల్దార్ పి శైల కుమారి, ఎంపీడీవో గోవర్ధన్, ఐసిడిఎస్ సూపర్వైజర్ హేమలత, అగ్రికల్చర్ ఏవో జ్యోతిర్మయి, ఆర్ ఐ ప్రవీణ్ రాయల్, వీఆర్వో అయ్యప్ప, హౌసింగ్ ఏఈ మోహన్ పాల్గొన్నారు.

వైద్యసేవలు అందడం లేదని మాజీ ఎంపిటిసి ఫిర్యాదు

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు సరైన వైద్యసేవలు అందడం లేదని, రోగిని పరీక్షించి వైద్యం చేసే పరిస్థితి లేదని, డాక్టర్లు వేళకు రావడం లేదని ఏకొల్లు మాజీ ఎంపిటిసి బందిలి ఉదయ్‌కుమార్ కలెక్టర్ వెంకటేశ్వర్ దృష్టికి తీసుకెళ్లారు. దొరవారిసత్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కలెక్టర్ తనిఖీ చేశారు. ప్రైవేట్ క్లినిక్‌లలో ప్రాక్టీస్ చేసుకుంటూ, ప్రభుత్వ విధులకు సక్రమంగా రావడం లేదన్నారు. స్పందించిన కలెక్టర్ ప్రభుత్వం నుంచి జీతాలు తీసుకుంటూ ప్రజలకు సేవ చేసేది తెలియదా? పని తీరు మార్చుకోవాలని, పని వేళలు పాటించాలని సిబ్బందిని హెచ్చరించారు. తరచూ ఆరోగ్య కేంద్రాల పనితీరుపై తనిఖీలు నిర్వహించి అక్కడ లోపాలను గుర్తించి నివేదిక సమర్పించాలని ఆర్డీవో కిరణ్మయికి సూచించారు.



ఆస్పత్రిలో వైద్యం సరిగ్గా అందడం లేదని ఫిర్యాదు

డాక్టర్ బాలాజీకి పరామర్శ



డాక్టర్ బాలాజీని పరామర్శిస్తున్న మాజీ ఎంపి పి.మధు

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: ప్రముఖ ఆక్యుపంక్చర్ వైద్యులు డాక్టర్ బాలాజీని సరోజినీ దేవి రోడ్డులోని ఆయన నివాసంలో గురువారం సిపిఎం మాజీ పార్లమెంటు సభ్యులు పెనుమల్లి మధు, జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, కందారపు మురళీలు సంయుక్తంగా పరామర్శించారు. ఇటీవల డాక్టర్ బాలాజీ తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. ప్రస్తుతం ఆయన కోలుకుంటున్న నేపథ్యంలో, సిపిఎం నేతలు ఆయన నివాసానికి వెళ్లి శీఘ్రంగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాల సంఖ్య పెంచాలి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ, పిచ్చాటూరు: సత్యవేడు నియోజకవర్గానికి కేటాయించిన ఎస్సీ కార్పొరేషన్ రుణాల సంఖ్యను పెంచాలని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చెన్నయ్యను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కోరారు. గురువారం తిరుపతిలోని సాంఘిక సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌కు ఎమ్మెల్యే వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్సీ జనాభాకు అనుగుణంగా రుణాల సంఖ్యను పెంచి ఎస్సీలను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ విక్రమ్ తదితరులు ఉన్నారు.

వితంతు పింఛన్లకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): వితంతు పింఛన్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ శోభన్ బాబు తెలిపారు. సెర్ప్ సీఈవో కరుణ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారన్నారు. 01.12.2023 నుండి 31.10.2024 మధ్యకాలంలో ప్రభుత్వం నుండి సామాజిక భద్రత పెన్షన్ పొందుతూ ఏదేని కారణం చేత మరణిస్తే, అతని భార్యకు పింఛన్ ఏర్పాటు చేసుకునే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 89788 మంది వితంతువులకు నెలకు రూ.4 వేల చొప్పున పింఛను మంజూరు చేయడానికి రూ.35.91 కోట్ల రూపాయలు ప్రభుత్వం వెచ్చించనుందన్నారు. తిరుపతి జిల్లాలో 3940 వితంతు పింఛన్లు మంజూరు చేయబడుతుందన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి జూన్ నుండి పింఛను మంజూరయ్యే అవకాశం ఉందన్నారు. వితంతు పింఛను కోసం దరఖాస్తు చేసుకునే వారు భర్త ఆధార్ కార్డు, భార్య ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పింఛను పుస్తకం, భర్త మరణ ధ్రువీకరణ పత్రం జిరాక్స్ కాపీలను జతచేసి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

శ్రీ సరస్వతి శిశు మందిరంలో గ్రాడ్యుయేషన్ డే



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, శ్రీ సరస్వతి శిశు మందిరం పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా విద్యార్థులకు మెరిట్ సర్టిఫికేట్‌లను అందచేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా గూడూరు ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ సూపరింటెండెట్ డాక్టర్ షరీనా, రోటరీ క్లబ్ అధ్యక్షుడు బండి శ్రీధర్ రెడ్డి, పాఠశాల కార్యదర్శి డాక్టర్ బండి శ్యామ్ సుందరరావు (మయూరి శ్యామ్ యాదవ్) పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను గురువుల దగ్గర నుంచి నేర్చుకోవాలని తద్వారా ఉన్నత స్థితికి రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సభాధ్యక్షులు సోమనాథ్, ఉపాధ్యక్షులు మురళి నాయుడు, సహకార దర్శి అశోక్ కుమార్, సమితి అధ్యక్షులు చిప్పల రమణయ్య, ఆడిటర్ రామ్మోహన్, వాకాటి రామ్మోహన్, లలిత, ప్రధానాచార్యులు రంగనాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్ : మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పటాన్ రఫీ ఖాన్ ఓ ప్రకటనలో తెలిపారు. కానీ సర్వసభ్య సమావేశం జరుపుకోవడానికి కావలసిన కోరం సరిపోకపోవడంతో మండల సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. మరలా ఎప్పుడు నిర్వహిస్తారో త్వరలోనే తెలియజేస్తామన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదని నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ పేర్కొన్నారు. వడమాలపేట మండలం, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ జయలక్ష్మి అధ్యక్షతన గురువారం సర్వసభ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజా సమస్యలు పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జడ్పిటిసి సభ్యులు మురళి రెడ్డి, ఎంపీటీసీలు నీరజ, లోకేష్ రెడ్డి, ఎస్‌బిఆర్ పురం సర్పంచ్ మణి రాజు, వెంకటేశు, మునెమ్మ, అధికార ప్రతినిధులు, పాల్గొన్నారు.

మజ్జిగ, ఐస్ క్రీం వితరణ

ప్రజాశక్తి - పుత్తూరు, టౌన్ : పుత్తూరు ఆర్టీసీ బస్సు స్టాండ్ వద్ద ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గోవింద భక్తులకు, ప్రయాణికులకు 200 మందికి ఐస్ క్రీమ్స్, మజ్జిగ వితరణ చేశారు. వారంలో రెండు రోజులు అసోసియేషన్ తరపున ఈ కార్యక్రమం చేపడతామని అసోసియేషన్ ఫౌండర్, అధ్యక్షులు కోనేటి రవిరాజు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బి.బాబు, కార్యదర్శి హెచ్. రామ్మోహన్‌వర్మ, ఉపాధ్యక్షులు కే.చంద్రబాబు, బాలసుబ్రహ్మణ్య రాజు, వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ సంబరాలు

ప్రజాశక్తి - రామచంద్రాపురం: ఎస్సీ షెడ్యూల్ కులాల వర్గీకరణ అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసిన సందర్భంగా నెత్తకుప్పం మాదిగపల్లిలో ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ సంబరాలను నెల్లేపల్లి దేవరాజులు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ తిరుపతి జిల్లా అధ్యక్షులు వి.రాజేంద్ర మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ గత 30 సంవత్సరాలుగా అలుపెరుగని పోరాట ఫలితమే నేడు వర్గీకరణ జరిగిందని ఈ వర్గీకరణ అములుతో మాదిగ జాతి అమరవీరులకు అంకితం అవుతుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గురవయ్య, తిరుమన్యం మునిరత్నం, నెల్లేపల్లి నాదముని, నెల్లేపల్లి లక్ష్మయ్య, నెల్లేపల్లి చెంగ్రాయులు, పట్నం వరదయ్య, పులికిల్లు రామచంద్రయ్య, నెల్లేపల్లి మునికృష్ణయ్య (పినపెద్ద), బాధూరు భాస్కర్, వావిల్లా మాధవరావు, చెంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పది ఫలితాల్లో శ్రీ గాయత్రి విద్యార్థుల ప్రతిభ



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో శ్రీగాయత్రి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు విజయదుంధుభి మోగించినట్లు కరస్పాండెంట్ శివకుమార్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. కరస్పాండెంట్ శివకుమార్ రెడ్డి మాట్లాడుతూ సుహానా 573, పరమేశ్వరి 572, స్పందన 553, సంబ్రాంత్ 532, సాయిపూర్ణ చంద్ర 531, సల్మా 524, కుమార్ 512 మార్కులు మరియు 570 మంది ఆపైనా ఇద్దరు విద్యార్థులు, 500 పైన 7 మంది విద్యార్థులు సాధించి మొదటి బ్యాచ్ లోనే రికార్డు ఫలితాలు సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డీన్ శ్రీహరి, ఉపాధ్యాయులు మస్తాన్బీ, రఫీ, రజిని, సుప్రజ, రాఘవయ్య, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చైతన్య భారతి విద్యార్థుల ప్రభంజనం



ప్రజాశక్తి-తిరుపతి (మంగళం) పదో తరగతి పరీక్ష ఫలితాలలో హాథీరాంజీ కాలనీలో ఉన్న చైతన్య భారతి హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాల కీర్తిని పెంచారని కరస్పాండెంట్ కె.జనార్ధనరెడ్డి అన్నారు. 587 మార్కులతో ఎన్.హేమలత ప్రథమ స్థానంలో నిలిచిందని, ఎన్.మనోజ్ 582, టి.చందన 579 మార్కులు సాధించారని అన్నారు. 87 శాతం మంది విద్యార్థులు ఫస్ట్ క్లాస్‌లో పాస్ అయ్యారన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులను కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేంద్రనాథ్, ఇన్చార్జి కె.వెంకటరమణ ఉపాధ్యాయులు అభినందించారు.

సుధహా విద్యార్థుల విజయకేతనం



సుధహా విద్యార్థులు

ప్రజాశక్తి- తిరుపతి (మంగళం) పదవ తరగతి పరీక్ష ఫలితాలలో తిరుపతి నగర పరిధిలోని సుధహా లిటిల్ సిటిజన్స్ హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు గుర్తింపు తీసుకువచ్చారని కరస్పాండెంట్ డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం తెలిపారు. 600 మార్కులకు గాను హారిక 576, నితీష్ 571, గురు ప్రియతమ్ 555 మార్కులు సాధించారన్నారు. ఇంత టి ఉత్తమ ఫలితాలు సాధించడానికి కారకులైన విద్యార్థుల తల్లిదంద్రు లకు కృషిని, ఉపాధ్యా య బృందం సేవలను ప్రత్యేకంగా అభినందించారు. అభినందన కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ రాజేంద్రప్రసాద్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు విష్ణు తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ మార్టిన్స్ విజయ దుందుభి



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి పద్మావతిపురం, నారాయణపురంలో గల సెయింట్ మార్టిన్స్ పాఠశాల విద్యార్థులు బుధవారం విడుదలైన 10వ తరగతి ఫలితాలలో మంచి పాస్ పర్సంటేజ్‌ను నమోదు చేశారని కరస్పాండెంట్ మురళీ మోహన్ తెలిపారు. కె.రెహానా 576, జి.లీలాధర్ 575, కె.అర్చన 571 మార్కులు సాధించి పాఠశాల ఖ్యాతిని పెంచారన్నారు.

ఘనంగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం

ప్రజాశక్తి - రామచంద్రపురం: గ్రామ పంచాయతీల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీడీవో ఇందిరమ్మ అన్నారు. గురువారం మండలంలోని చుట్టుగుంట రామాపురం గ్రామపంచాయతీ కార్యాలయంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ కె.సుబ్రహ్మణ్యం రెడ్డి అధ్యక్షతన, పంచాయతీ కార్యదర్శి పి.చంద్రశేఖర్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో, సర్పంచ్ సుబ్రహ్మణ్యం రెడ్డి, పంచాయతీ కార్యదర్శి పి.చంద్రశేఖర్ రెడ్డిలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పంచాయతీల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని తెలిపారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులను, సిబ్బందిని, టిడిపి నాయకులు కె.గిరిధర్ రెడ్డి, ముద్దు కృష్ణారెడ్డి, ముని రామిరెడ్డి, సుబ్రహ్మణ్యం రెడ్డి, రంజిత్ కుమార్ రెడ్డిలు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ వార్డ్ మెంబర్లు, వీఆర్వో యూన్నీ, డిజిటల్ అసిస్టెంట్ భరత్ కుమార్ రెడ్డి, బిల్ కలెక్టర్ సుబ్రహ్మణ్యం, పంచాయతీ కార్యాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పుత్తూరు : పుత్తూరు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీరాజ్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ మునివేలు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, సిబ్బంది గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్: మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో గురువారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎంపీడీవో పటాన్ రఫీ ఖాన్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పల్లె ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పంచాయతీరాజ్ వ్యవస్థ వారి విధులు కొనసాగించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్డి పద్మజ, ఆయా పంచాయతీల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

టైలరింగ్ శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మహిళ ఆర్థిక అభివృద్ధికి సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని నగరి నియోజకవర్గ ఎమ్మెల్యేం గాలి భాను ప్రకాష్ పేర్కొన్నారు. పట్టణంలోని స్థానిక మున్సిపాలిటీలో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ తరగతును ప్రారంభించారు. శిక్షణ పూర్తయిన మహిళలకు టైలరింగ్ మిషన్లు ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు, పట్టణ ప్రధాన కార్యదర్శి ఎస్ఎన్ ధనపాల్, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య, మహిళా నాయకులు, మున్సిపల్ కమిషనర్ మంజునాథ గౌడ, మున్సిపల్ అధికారులు. బిసి మహిళలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-రామచంద్రపురం (పాకాల) గ్రామీణ ప్రాంతాలలోని మహిళలకు చేతివృత్తులపై నైపుణ్యతను పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తున్నదని టిడిపి మహిళా నేత పులివర్తి సుధా రెడ్డి అన్నారు. గురువారం పాకాల మండలంలోని దామలచెరువు, రమణయ్య గారి పల్లి గ్రామాలలో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీసీ కార్పొరేషన్ ద్వారా గ్రామాలలో మహిళలకు చేతివృత్తులపై శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని మహిళలందరూ సద్వినియోగం చేసుకొని, స్వయం ఉపాధిని ఏర్పరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాకాల జడ్పిటిసి నంగా పద్మజా రెడ్డి, కూటమి పార్టీలకు చెందిన మహిళ నేతలు, పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించండి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : తమ కాలనీకి మౌలిక వసతులు కల్పించాలని 27 వార్డు, బొజ్జ నెత్తం ఎస్టీ కాలనీ వాసులు, పుత్తూరు కమిషనర్ ఎం.మంజునాథ్ గౌడ్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దళిత గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి వై.నందయ్య మాట్లాడుతూ బొజ్జ నెత్తం ఎస్టీ కాలానికి సిమెంటు రోడ్లు లేక వీధులు గుంతలమయమయ్యాన్నారు. రాత్రుళ్ల రోడ్లపై నడవాలంటే ఇబ్బంది పడుతున్నారని, కొద్ది పాటి వర్షం వస్తే బురదతో జారి పడుతన్నారని తెలిపారు. దోమలకు ఫాగింగ్ చేయాలని, తాగునీటి బోరు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యం.గంగాధరం, సుబ్బమ్మ, చెంచురామయ్య తదితరులు పాల్గొన్నారు.

బూత్ లెవల్ ఏజెంట్లను నియమించుకోవాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : తిరుపతి నియోజకవర్గ పరిధిలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించుకోవాలని తిరుపతి నియోజకవర్గ ఇంచార్జి ఓటరు నమోదు అధికారి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య పిలుపునిచ్చారు. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ఆదేశాల మేరకు గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇంచార్జి ఓటరు నమోదు అధికారి మాట్లాడుతూ ఇప్పటి వరకు ప్రజల నుండి వచ్చిన అన్ని దరఖాస్తులను పరిశీలించాలని, వాటి వివరాలు అందుబాటులో ఉంచాలని అన్నారు. ప్రతి రాజకీయ పార్టీల ప్రతినిధులు బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించుకోవాలని అన్నారు. బి.ఎల్. ఓ.లు ఇంటింటి సర్వే చేసి నివాసాలు మారిన వివరాలు సేకరించి ఫారం-8 అప్లై చేశామని, ఇంకా ఏవైనా ఉంటే తమ దష్టికి తీసుకు రావాలని ప్రతినిధులను కోరారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, ఆర్.సి.మునికృష్ణ, కార్పొరేటర్ నరసింహ ఆచారి పాల్గొన్నారు.

వైసీపీ బలోపేతానికి కృషి చేస్తా



జగన్మోహన్ రెడ్డితో హరి ప్రసాద్ రెడ్డి

ప్రజాశక్తి - క్యాంపస్ : వైసీపీ రాష్ట్ర ప్రచార విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వి.హరి ప్రసాద్ రెడ్డిని నియామకం చేసినట్లు పార్టీ అధిష్టానం నియామక ఉత్తర్వులు విడుదల చేసింది. 2004 నుంచి శ్రీ వెంకటేశ్వర విద్యాలయం వేదిక విద్యార్థి రాజకీయాలలో హరి ప్రసాద్ రెడ్డి కీలక పాత్ర పోషించారు. 2004లో ఎన్ ఎస్‌యు ఐ అధ్యక్షులుగా, 2007 ఎన్ఎస్‌యుఐ ఉమ్మడి రాష్ట్ర కోఆర్డినేటర్‌గా, 2009 సమైక్యాంధ్ర ఉద్యమంలో రాయలసీమ జేఏసీ కన్వీనర్‌గా, అనంతరం వైసీపీలో 2014 నుంచి 2018 విద్యార్థి విభాగం ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులుగా, 2018 – 2022 సంవత్సరంలో రాయలసీమ విద్యార్థి విభాగం రీజినల్ కోఆర్డినేటర్‌గా ఆయన సమర్ధవంతంగా సేవలందించారు. 2014–2019 మధ్యలో పార్టీ కోసం, ప్రత్యేక హోదా కోసం యూనివర్సిటీ వేదికగా పలు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా హరి ప్రసాద్ రెడ్డి పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డికి, వైసీపీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

పారదర్శకంగా పోలీసుల బదిలీలు



జిల్లా పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సోమశేఖర్, జాయింట్ సెక్రెటరీ శంకర్ రెడ్డి, సలహాదారుడు ప్రసాద్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ : తిరుపతి జిల్లాలో పోలీస్ సిబ్బంది బదిలీలు చాలా పారదర్శకంగా నిర్వహించారని, ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజుకు జిల్లా పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సోమశేఖర్, జాయింట్ సెక్రెటరీ శంకర్ రెడ్డి, సలహాదారుడు ప్రసాద్ రాజు తెలిపారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ సాధారణ బదిలీల సందర్భంగా ఈ మధ్య ఇతర జిల్లాలలో జరిగిన కొన్ని సంఘటనలు చూసి, తిరుపతి జిల్లా లోని పోలీసు సిబ్బంది కౌన్సిలింగ్ చేయకుండా సుదూర ప్రాంతాలకు బదిలీలు చేస్తారేమో అని చాలామంది భయాందోళనలకు గురయ్యారన్నారు. అయితే గతంలో ఎన్నడూ లేనివిధంగా తిరుపతి జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన రాజు సుమారు వారం రోజుల పాటు జిల్లాలోని అడిషనల్ ఎస్పిలు, డిఎస్పిలు, డీపీవో అధికారులతో మీటింగ్‌లు నిర్వహించి, జిల్లాలో కానిస్టేబుల్ నుండి ఏఎస్ఐ స్థాయి వరకు ఒక స్టేషన్‌లో 5 సంవత్సరాలు సర్వీసు పూర్తి అయిన వారి వివరాలు సేకరించి, ప్రలోభాలకు తావులేకుండా 27 మంది ఏ ఎస్ ఐలు, 100 మంది హెడ్ కానిస్టేబుళు, 266 మంది కానిస్టేబుళ్లు, మొత్తం 393 మంది పోలీసు సిబ్బందిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించారు. అందుబాటులో ఉన్న ఖాళీలను డిజిటల్ బోర్డులో ప్రదర్శించి, వారు కోరుకున్న చోటుకు బదిలీ చేశారని, ఈ కారణంగా తమపై ఒత్తిడి ఉండదని పేర్కొన్నారు.

శ్రీవారి సేవలో నటి మీనాక్షి



ప్రజాశక్తి -తిరుమల: మీనాక్షి చౌదరి గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఈమె ఓ డాక్టర్ అయినప్పటికీ సినిమాల మీద ఉన్న ఆసక్తితో సినీ రంగంలోకి ఎంట్రీ ఇచ్చింది. అనేక సినిమాలలో నటించి సక్సెస్ సాధించిన ఈ చిన్నది రీసెంట్ గా సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ సినిమానూ తన ఖాతాలో వేసుకుంది. ఇందులో పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించి ప్రేక్షకులను తన వైపుకు తిప్పుకుంది. అంతే కాకుండా హీరో వెంకటేష్ కు ఎక్స్ లవర్ పాత్రను పోషించింది. ఈ సినిమాలో వెంకటేష్ మీనాక్షి చౌదరి మధ్య వచ్చే సన్నివేశాలు సినిమాకే హైలైట్ గా నిలిచాయని చెప్పవచ్చు. ఈ సినిమా అనంతరం మీనాక్షి చౌదరి వరుసగా సినిమాలలో అవకాశాలను అందుకుంటుంది. ఇప్పటికే ఈ అమ్మడి చేతిలో మూడు నాలుగు సినిమా ప్రాజెక్టులకు పైనే ఉన్నట్లుగా సమాచారం అందుతోంది. తెలుగులోనే కాకుండా ఈ చిన్నది తమిళంలోనూ అనేక సినిమాలలో అవకాశాలను అందుకుంటుంది. ఇదిలా ఉండగా. మీనాక్షి చౌదరి గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనం చేసుకుని బయటకు వస్తున్న సమయంలో కొంత మంది మీనాక్షి చౌదరి ఫోటోలు, వీడియోలు తీసుకున్నారు. వాటిని సోషల్ మీడియాలో షేర్ చేసుకోగా అవి విపరీతంగా వైరల్ గా మారుతున్నాయి.

రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - క్యాంపస్ : జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో ఆరోగ్య సంక్షేమ చర్యల్లో భాగంగా యూనివర్సిటీ హెల్త్ సెంటర్, ఎన్ఎస్ఎస్ యూనిట్-4, యూనిట్-6, తిరుపతిలోని రుయా హాస్పిటల్ సహకారంతో గురువారం విశ్వవిద్యాలయంలో "రక్తదాన శిబిరం" నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథి వర్సిటీ విసి ప్రొ. జిఎస్ఆర్. కృష్ణమూర్తి, ఫినాన్స్ ఆఫీసర్ ప్రొ.రాధాగోవింద త్రిపాఠి, స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ ప్రొ.ఎస్.దక్షిణామూర్తి శర్మ, విశ్వవిద్యాలయ సీనియర్ మెడికల్ ఆఫీసర్ డా.బి.బాలదత్తాత్రేయలు రక్తదానం విశిష్టతను తెలిపారు. ఈ కార్యక్రమంలో డా.హరిత, మెడికల్ ఆఫీసర్, రుయా హాస్పిటల్, డా.ఎ.చందులాల్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్‌బీ డా.పి.శ్వేత, సీనియర్ మెడికల్ ఆఫీసర్, శ్రీ.కరణం సందీప్, రుయా హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యుడుబీ డా.సి.చిరంజీవి, ఆయుర్వేద కన్సులేటెంట్, ఎన్ఎస్‌యు, శ్రీ.వి.సేతురామ్ యూనిట్-4 ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ మరియు డా.బుల్టీ దాస్, యూనిట్-6 ప్రోగ్రాం ఆఫీసర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ రక్తదాన శిబిరంలో మొత్తం 50 మంది దాతలు రక్తదానం చేశారు.

క్రైం న్యూస్

యస్వీయులో శ్రీగంధం చెట్టు మాయం



ప్రజాశక్తి - క్యాంపస్ : యస్వీయులో వాచ్‌మెన్ల కొరతతో చోరులకు దొరికింది దోచుకునే పరిస్థితి ఏర్పడింది. గతంలో ఎన్నో సార్లు వృక్ష సంపదను, ఇనుము, తుక్కు తదితర వస్తువులను బయట వ్యక్తులు అడ్డదిడ్డంగా దోచుకెళ్లారు. బుధవారం రాత్రి సైన్స్ కళాశాల భవనం, ప్రిన్సిపల్ ఆఫీస్ ఎదురుగా ఉన్న శ్రీగంధం చెట్టును దొంగలు కొట్టుకెళ్లారు. వీటి గురించి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విడ్డూరంగా ఉందని విద్యార్థి సంఘాల నేతలు తీవ్రంగా విమర్శిం చారు. వర్సిటీ ఉన్నతాధికారులు ఔట్సోర్సింగ్ విధానం ద్వారా వాచ్మెన్ల సంఖ్యను పెంచి వర్సిటీలో విద్యార్థులకు, వర్శిటీ ఆస్తులకు భద్రత కల్పించాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

విద్యుత్ తీగలు తగిలి వ్యక్తి మృతి



శ్రీకాంత్ మృతి దేహం

ప్రజాశక్తి - యర్రావారిపాలెం: మండలంలోని చింతగుంట గ్రామపంచాయతీ, పచ్చార్ల వాండ్లపల్లి సమీపంలోని పొలాల వద్ద ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి శ్రీకాంత్(32) అనే వ్యక్తి మృతి చెందాడు. పొలాలకు పందుల కోసం వేసిన విద్యుత్ తీగలు తగలడంతో మృతి చెందాడని స్థానికులు తెలిపారు. మృతుడి బంధువుల సమాచారం మేరకు బాకరాపేట సిఐ ఇమ్రాన్ భాష కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

హత్య కేసులో ముగ్గురికి యావజ్జీవం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : ఏర్పేడు మండలం ముసలిపేడు గ్రామంలో ఎనిమిదేళ్ల కిందట జరిగిన ఓ మహిళ హత్య కేసులో శ్రీకాళహస్తి 12వ జిల్లా అదనపు కోర్టు గురువారం సంచలన తీర్పును వెలువరించింది. హత్యలో పాలుపంచుకున్న ముగ్గురికి జీవిత ఖైదు, రూ.15 వేలు జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి ఎం.శ్రీనివాసులు తీర్పు చెప్పారు. వివరాల్లోకి పోతే...ఏర్పేడు మండలం ముసలిపేడుకు చెందిన మఠం రానెమ్మ కుమారుడు బాలసుబ్రమణ్యం కు అదే మండలం చెల్లూరు గ్రామానికి చెందిన సుబ్బమ్మతో వివాహమైంది. వీరికి ఒక కుమారుడు. అయితే కుటుంబ కలహాల కారణంగా సుబ్బమ్మ భర్తతో విడిపోయి పుట్టినిల్లు అయిన చెల్లూరులో కుమారుడితో కలిసి జీవనం సాగించేది. ఈ నేపథ్యంలో తండ్రి బాలసుబ్రమణ్యం అనారోగ్యంతో చనిపోగా, ఆయన అంత్యక్రియలకు హాజరైన తన తల్లి సుబ్బమ్మపై ఆడబిడ్డ గుంటి కోళ్ల సుజాత, ఆమె భర్త గుంటి కోళ్ల వెంకటేష్, అత్త మఠం రానెమ్మలు 2017 మే 11న సూరికత్తితో పొడిచి హత్య చేశారని సుబ్బమ్మ కుమారుడు జగ్గయ్య ఏర్పేడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి సీఐలు మురళీధర్, సాదిక్ అలీ, ఎస్సై వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఎనిమిదేళ్ల తర్వాత నేరం నిరూపణ కావడంతో జిల్లా జడ్జి శ్రీనివాస్ నిందితులను దోషులుగా నిర్ధారిస్తూ యావజ్జీవ కారాగార శిక్షను, ఒక్కొక్కరికి రూ.15వేలు జరిమానాను విధిస్తూ తీర్పు వెలువరించారు.

చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలి వేంద్రం ఏర్పాటు చేశామని గూడూరు ఎంపిపి గురవయ్య, గూడూరు ఎంపిడివో మధుసూదన్ రావులు పేర్కొన్నారు. గురువారం గూడూరు పట్టణంలోని ఎంపిడివో కార్యాలయంలో చలివేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు శ్రీనివాసులు రెడ్డి, ఇంద్రాణి, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-నాగలాపురం: తిరుపతి జిల్లా ఎస్పి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు గురువారం నాగలాపురం పోలీసు స్టేషన్ ఎదురుగా ఎస్ఐ సునీల్ ఆద్వర్యంలో పోలీసు సిబ్బంది చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ రవి, కానిస్టేబుల్ కృష్ణ, దివాకర్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మండల సర్వ సభ్య సమావేశం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గురవయ్య ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సాధారణ సమావేశం నిర్వహించారు. ముందుగా జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా మహాత్మ గాంధీ, అంబేద్కర్ చిత్రపటాలకు ఎంపిపి గురవయ్య పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం గ్రామాల్లో అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీలు శ్రీనివాసులు రెడ్డి, ఇంద్రాణి, ఎంపీడీవోమధుసూధన్ రావు, పలు శాఖల అధికారులు, ఎంపీటీసీలు , సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, పాల్గొన్నారు.

డిపిఓ సుశీలదేవికి అవార్డు ప్రదానం



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని విజయవాడలో నిర్వహించిన పంచాయతీరాజ్ వేడుకల్లో జిల్లా పంచాయతీ అధికారి దాయన సుశీలదేవికి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి అవార్డును ప్రధానం చేశారు. తిరుపతి జిల్లాలో ఉన్న 774 గ్రామపంచాయతీలలో ఇంటి పన్నులు, పన్నేతరముల వసూళ్లకు సంబంధించి 83 శాతం వసూళ్లు చేసి రాష్ట్రంలోనే తిరుపతి జిల్లాను 3వ స్థానంలో నిలిపినందుకుగాను సుశీలదేవికి అవార్డు ప్రధానం చేశారు. అలానే తిరుపతి జిల్లా నుండి ఉపాధి హామీ, పల్లె పండుగ కార్యక్రమంలో ఉత్తమ సేవలకుగాను పంచాయతీరాజ్ ఎస్ఈ రామ్మోహన్, ఉపాధి హామీ పథకం అమలులో ప్రతిభ చూపిన ఫీల్డ్ అసిస్టెంట్ బాలరాజు అవార్డులు అందుకున్నారు.

ఏహెచ్ సూపరింటెండెంట్‌గా మణి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి ప్రాంతీయ వైద్యశాల సూపరింటెండెంట్‌గా కంటి వైద్య నిపుణురాలు డాక్టర్ మణి గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో సూపరింటెండెంట్ గా బాధ్యతలు నిర్వర్తించిన డాక్టర్ విజయలక్ష్మిని ఆర్ఎంవోగా ప్రభుత్వం నియమించింది. గతంలో ఆర్ఎంవో గా పనిచేసిన డాక్టర్ మధు పెథాలజిస్ట్ గా తన సేవలు కొనసాగించనున్నారు. సీనియారిటీ ప్రకారం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంలో భాగంగా స్థానిక ఏరియా ఆసుపత్రిలో ఈ ఆదేశాలు అమలు కానున్నాయి.

ఉపాధి కల్పనే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - పిచ్చాటూరు: యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. గురువారం సాయంత్రం పిచ్చాటూరు టీడీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ శుక్రవారం ఉదయం 10 గంటలకు సత్యవేడు దాస్ కాలేజీ లో ప్రభుత్వం మెగా జాబ్ మేళా నిర్వహిస్తోందన్నారు. ఇందుకు సంబంధించి బుధవారం కలక్టరేట్‌లో రాష్ట్ర చిన్న పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ వేంకటేశ్వర్‌తో కలిసి పోస్టర్‌లను ఆవిష్కరించారని తెలిపారు. మెగా డీఎస్సీ నోటిఫికేషను విడుదల చేసి, ఈ ఏడాది జూన్ నాటికి 16000 పైచిలుకు టీచర్ పోస్టులను భర్తీ చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ డి.ఇలంగోవన్ రెడ్డి, టీడీపీ నాయకులు పద్దు రాజు, రవి రెడ్డి, సురేష్, ఆరుల్ ప్రకాశ్, రవి, వాసు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టిటిడి కాంట్రాక్టర్ భార్య భారతి మృతి




ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ప్రముఖ టీటీడీ కాంట్రాక్టర్ శివశంకర్ రెడ్డి భార్య భారతి అనారోగ్యంతో బెంగళూరులో హాస్పిటల్‌లో గురువారం తుది శ్వాస విడిచారు. శుక్రవారం తిరుపతిలోని కేశవాణి గుంటలో వారి నివాసం నుంచి అంతిమ యాత్ర ప్రారంభమవుతుందని, గోవిందదమంలో ఉదయం 10 గంటలకి అంతక్రియలు నిర్వహించినట్లు తెలిపారు. భారతి మృతి పట్ల రాజకీయ నాయకులు, టిటిడి ప్రముఖ కాంట్రాక్టర్లు సానుభూతి తెలియజేశారు.

దళిత గిరిజనుల కష్టాలు పట్టవా..?

- అడుగడుగునా పెత్తందార్ల కక్ష సాధింపులు
- అంధకారంలో దళిత గిరిజనులు
- రాజకీయ నాయకుల బెదిరింపులు

ప్రజాశక్తి- వెంకటగిరి టౌన్: వెంకటగిరి మండలం, పెట్లూరు పంచాయతీ పరిధి సర్వేనెంబర్ 12-1 లో 519 ఎకరముల ప్రభుత్వ మేతపోరం బోకు భూమి ఉంది. ఈ భూమి కోసం ఆ గ్రామానికి చెందిన దళిత గిరిజనులు 2011వ సంవత్సరం నుండి అధికారుల చుట్టూ తిరుగుతూ ఉన్నారు. ఈ భూమిని ఫారెస్ట్ పేరుతో గతంలో అనేకమంది అగ్రకుల పెత్తందారులు తమ గుప్పెట్లో ఉంచుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేశారు. ఈ భూమి వెంకటగిరి నుండి నాయుడుపేటకు వెళ్ళు రోడ్డు ప్రక్కనే ఉంది. చాలా విలువ కలిగినటువంటి భూమి, గ్రామంలో దళిత గిరిజనులు ఈ భూములు దక్కించుకునేందుకు, చెట్టూ పుట్ట కొట్టుకుని సాగు చేసుకునేందుకు అనేక దఫాలుగా ప్రయత్నాలు చేశారు. కానీ అగ్రకుల పెత్తందారులు ఈ భూములపై కన్నేసి, దళిత గిరిజనులు ఆ భూముల్లోకి తరిమేయాలని కుట్రపన్ని ఫారెస్ట్ వారిని ఉసిగొలిపి వారి మీదకి పంపించి అరెస్టులు చేయడం, ఫైన్లు వేయడం వంటి చర్యలతో ఆ భూముల్లోకి రానివ్వకుండా చేశారు. ఆ గ్రామానికి చెందిన దళిత గిరిజనులు గత రెండు సంవత్సరాల క్రితం సిపిఎం పార్టీని ఆశ్రయించారు. సిపిఎం నాయకులు ఆ భూములను పరిశీలించి రెవెన్యూ భూములని తేల్చారు. రెవెన్యూ భూములు కాబట్టి వ్యవసాయ కార్మిక సంఘం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో రెండు సంవత్సరాల క్రితం ఇల్లు లేని పేదలు గుడిసెలు వేసుకుని నివాసాలు ఉంటున్నారు. గుడిసెల్ని పీకేయాలని పెత్తందారులు ఫారెస్ట్, పోలీసు, రెవెన్యూ శాఖల వారిని పేదల పైకి పంపించడం జరిగింది. అక్కడున్న దళిత గిరిజనులు వెనుకబడిన తరగతుల వారు ఐక్యమత్యంతో సంఘటితంతో ఎదుర్కొని గుడిసెల్ని కూల్చనివ్వకుండా అడుకున్నారు. అనంతరం పేదలు హైకోర్టును ఆశ్రయించి ఆర్డర్ తెచ్చుకున్నారు. అత్యున్నత న్యాయస్థానం, పేదలు నివాసాలు ఉంటున్న ఇల్లు జోలికి గాని పేదల జోలికి గాని



ఎవరు వెళ్ళకూడదు అక్కడే నివాసాలు ఉండవచ్చు అని ఆర్డర్ ఇచ్చియున్నారు. అయినా కూడా అక్కడ ఉన్న రాజకీయ పెత్తందారులు అడుగడుగున దళిత గిరిజనుల్ని ఇబ్బందులకు గురి చేసేందుకు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు.

పట్టాలిచ్చి మౌలిక వసతులు కల్పించాలి

సీతారాం ఏచూరి నగర్‌లో దళిత గిరిజనులు పేదలు 110 కుటుంబాల వారు నివాసాలు ఉంటున్నారు. వీరు నివసిస్తున్న భూమికి పట్టాలిచ్చి, తాగు నీరు, రోడ్లు, సైడు కాలువలు, కరెంటు వసతి కల్పించాలని కోరుతున్నారు.

ఆ భూమి, రెవెన్యూ పరిధిలోది..

సర్వే నెంబర్ 12-1 లో గల 45 ఎకరాల ప్రభుత్వ భూమి రెవెన్యూకి సంబంధించినదని పేదలు ఖాళీచేయకుండా పట్టుదలతో ఉండటంతో, అందరూ దిగివచ్చి ఫారెస్ట్, రెవెన్యూ శాఖలవారు జాయింట్ సర్వే జరిపారు. పేదలు నివాసాలు ఉంటున్న గుడిసెలకు సంబంధించిన స్థలం రెవిన్యూ స్థలమని జాయింట్ సర్వేలో తేలింది. ఒకవైపు హైకోర్టు కేసు నడుస్తున్నప్పటికీ, మరోవైపు రెవెన్యూ స్థలం అయినా కూడా ఫారెస్ట్ వారు మాది అంటూ పేదలను ఇబ్బంది పెట్టడానికి వస్తున్నారంటే వీరి వెనుక ఎవరు ఉన్నారనేది తెలియాల్సి ఉంది.

ఫారెస్ట్ పేరుతో కాజేయాలని చూస్తున్నారు

సర్వేనెంబర్ 12 -1లోనే మోడల్ స్కూల్ ఉంది. ఇదే సర్వే నెంబర్లో జగనన్న కాలనీ ఉంది, ఇదే సర్వే నంబర్‌లో 10 ఎకరములు చొప్పున ఇద్దరికీ, అలాగే రెండు ఎకరాలు, మూడు ఎకరాలు చొప్పున ఐదు మందికి సాగుభూములుకి పట్టాలు మంజూరు చేసి ఉన్నారు. వీరందరూ జోలికి మాత్రం ఫారెస్ట్ వారు వెళ్లడం లేదు. దళిత గిరిజనులు పేదలు నివాసాలు ఉంటున్న భూమి జోలికి మాత్రం వస్తున్నారు. ఇది ఎక్కడి న్యాయం. ఇదే సర్వే నెంబర్లో, ఈ భూములన్నిటి మధ్యలో పేదల కాపురాలు ఉంటున్నారు. అధికారుల తీరు ఫారెస్ట్ వారి తీరు వ్యవహార శైలి ఏ విధంగా ఉందంటే పెద్దోళ్ళకి రాజకీయ పలుకుబడి కలిగిన వాళ్లకి ధన బలం కలిగిన వాళ్లకి ఒక న్యాయం, సెంటు భూమిలేని నిరుపేదలకు మరో న్యాయమాని ప్రశ్నిస్తున్నారు.

భూములకు రక్షణ కల్పించాలి

1977వ సంవత్సరంలో హోమ్ డిపార్ట్మెంట్, రెవెన్యూ డిపార్ట్మెంట్ వారు జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం వీరు దళిత గిరిజనులకు పేదలకు రక్షణగా నిలబడాలి. దళిత గిరిజనులు ప్రభుత్వ భూముల్ని ఆక్రమణ చేసుకొని ఉంటే ఆ భూములకి రక్షణ కల్పించాల్సిన బాధ్యత వారికి రక్షణ కల్పించాల్సిన హోమ్, రెవెన్యూ శాఖలవారిదేనని ఉత్తర్వులు జారీ చేసి ఉన్నారు. కనుక తమకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

20న దేశవ్యాప్త నిరసనను జయప్రదం చేయండి : సిపిఎం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర నాయకులు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ : రాష్ట్రంలో ప్రజల కొనుగోల శక్తి పూర్తిగా క్షీణించిందని సిపిఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి పి.మధు అన్నారు. మే 20న జరగనున్న దేశవ్యాప్త నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. తిరుపతి ప్రెస్ క్లబ్లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 80 లక్షల మంది అసంఘటిత కార్మికుల ఉన్నారని, 20 సంవత్సరాలుగా వారికి కనీస వేతనాలు లేవన్నారు. పక్క రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక కంటే ఆంధ్రప్రదేశ్లో కార్మికుల వేతనాలు తక్కువగా ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో ప్రజల అవసరాలకు తగ్గ డబ్బులు అందక, చాలీచాలని వేతనాలు కారణంగా ప్రజలకు కొనుగోలు శక్తి క్షీణించిందన్నారు. ప్రజలు మార్పును ఆశించి కూటమి ప్రభుత్వానికి మద్దతు తెలిపితే, వారు అధికారంలోకి వచ్చిన తర్వాత ప్లేటు ఫిరాయించారన్నారు. టీటీడీలో వేలాది మంది కార్మికులు పనిచేస్తున్నారని, నిత్యం వచ్చే లక్షలాది మంది భక్తులకు సేవలు చేస్తున్నారని, ఇక్కడ మత ఉన్మాదాన్ని రెచ్చగొట్టడం సరైనది కాదన్నారు. ఇలాంటి మతోన్మాదానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల ఆద్యం పోసారని విమర్శించారు. నాలుగో తరగతి ఉద్యోగులలో ముస్లిం, క్రైస్తవులను తొలగించాలని అనుకోవడం సరైనది కాదని హితవు పలికారు. మే 20న వామపక్ష ప్రత్యామ్నాయం కోసం దేశవ్యాప్తంగా నిరసన నిర్వహిస్తామని, అందులో భాగంగా ఆంధ్రప్రదేశ్లో కలిసి వచ్చే అన్ని పార్టీలు సంఘాలను కలుపుకొని నిరసన చేపడతామన్నారు. ఈ సమావేశంలో సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందారపు మురళి పాల్గొన్నారు.

సతీష్ రెడ్డికి అభినందన



సతీష్ రెడ్డిని సత్కరిస్తున్న ప్రొఫెసర్ వైవి రామిరెడ్డి

ప్రజాశక్తి - క్యాంపస్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పారిశ్రామిక సలహాదారుగా క్యాబినెట్ ర్యాంకుతో నియమితులైన డిఆర్డిఓ మాజీ చైర్మన్, కేంద్ర రక్షణ శాఖ మంత్రి శాస్త్రీయ సలహాదారు అయిన డాక్టర్ గుండ్రా సతీష్ రెడ్డి గురువారం మంగళగిరిలోని ఏపీఐఐసీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఏబీఆర్ఎస్ ఎమ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ తరపున రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ వై వి రామిరెడ్డి, డాక్టర్ సతీష్ రెడ్డిని కలిసి అభినందించి, సత్కరించారు. దేశ రక్షణ రంగంలో దాదాపు 35 సంవత్సరాలు సేవలు అందించి రక్షణ పరికరాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధిని సాధించటములో కీలకంగా వ్యవహరించిన అందించిన సతీష్ రెడ్డి అపార అనుభవం ,మేధస్సు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పారిశ్రామిక రంగం పురోగతికి ఎంతైనా దోహదపడుతుందని, వివిధ పరిశ్రమలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తీసుకొని రావటంలో డాక్టర్ సతీష్ రెడ్డి అపార పరిచయాలు ఎంతైనా ఉపయోగపడతాయని అన్నారు.

విద్యతో పాటు విజ్ఞానం పెంచుకోండి



విద్యార్థులకు నీతి కథల పుస్తకాలు అందచేస్తున్న ట్రైనీ ఐపీఎస్ బొడ్డు హేమంత్

ప్రజాశక్తి - రామచంద్రాపురం: గ్రామీణ ప్రాంతాలలోని చిన్నారులు చిన్నతనం నుంచే విద్యతో పాటు విజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకుంటూ నైతిక విలువలను పెంపొందించుకోవాలని ట్రైనీ ఐపీఎస్ బొడ్డు హేమంత్ పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని గంగిరెడ్డిపల్లి పంచాయతీ పద్మావళిపురం గ్రామంలోని చిన్నారులకు నైతిక విలువలు పెంపొందించుకునేలా ఉండే నీతి కథలు, బొమ్మల పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులు ప్రాథమిక విద్య స్థాయి నుంచే పుస్తక పఠనం, చక్కగా అక్షరాలు రాసే విధానాన్ని పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను సత్ప్రవర్తనలో నడిచే విధంగా చర్యలు తీసుకోవాలని అవగాహన కల్పించారు. చిన్నతనం నుండి విద్యార్థులను టీవీలు సెల్ ఫోన్ జోలికి వెళ్ళనీయకుండా దురలవాట్లకు దూరంగా ఉండేటట్లు తల్లిదండ్రులు జాగ్రత్త తీసుకోవాలని కోరారు. గ్రామంలోని 30 మంది చిన్నారులకు నీతి కథలు కలిగిన పుస్తకాలు, బొమ్మల పుస్తకాలను, తన సొంత నిధులతో కొనుగోలు చేసి అందజేశారు. గ్రామాలలో ప్రశాంత జీవనాన్ని గడిపేందుకు ప్రజలు సోదర భావాలను పెంపొందించుకోవాలన్నారు. సైబర్ క్రైమ్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. హెల్మెట్ ధరించి వాహనాలను నడిపితే ప్రమాదాల నుంచి ప్రాణాలను కాపాడుకోవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ త్యాగరాజు, బి రమేష్ రెడ్డి, వెంకటేష్, మహేష్, రమేష్ రాయల్ సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

భక్తి, శ్రద్ధలతో శ్రీవారి మెట్ల పూజ

ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి) సనాతన ధర్మాన్ని కాపాడటంలో భాగంగా కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వారు నడయాడిన శ్రీవారి మెట్టు మార్గంలో 486 సారి మెట్ల పూజ నిర్వహిస్తున్నట్లు శ్రీకాకుళానికి చెందిన మహంతి శ్రీనివాసరావు తెలిపారు. శ్రీనివాస మంగాపురం సమీపంలోని శ్రీవారి మెట్టు నుంచి దక్షిణ భారతదేశ గోవింద యాత్ర వాట్సాప్ అసోసియేషన్ అధ్యక్షులు మహంతి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శ్రీవారి మెట్ల పూజను వైభవంగా ప్రారంభించారు. శ్రీవారి మెట్టు వద్ద కొబ్బరి కాయలు కొట్టి, మెట్ల పూజను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క వాట్సాప్ మెసేజ్తో ఆంధ్రప్రదేశ్లోనే కాక తెలంగాణ, ఒరిస్సా, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల నుంచి పలువురు భక్తులు ఈ పూజకు వచ్చినట్లు చెప్పారు. గత 6 సంవత్సరాలకు ముందు సనాతన ధర్మాన్ని కాపాడటానికి వెంకటేశ్వర స్వామి వారి మహిమను అన్ని ప్రాంతాలలో ప్రచారం చేయటానికి దక్షిణ భారతదేశ గోవింద యాత్ర వాట్సాప్ అసోసియేషన్ను ప్రారంభించినట్లు చెప్పారు. మొదటిసారి ఏడు మంది శ్రీవారి భక్తులతో ప్రారంభమైన ఈ యాత్రను ఇప్పటికీ 485 సార్లు దిగ్విజయంగా నిర్వహించమని తెలిపారు. గురువారం 486 వ సారి స్వామి వారి కృపతో 1024 మంది భక్తులతో ప్రారంభించినట్లు తెలియజేసారు. యాత్రలో నాలుగు నెలల పసికందు నుంచి 75 సంవత్సరాల వృద్ధుల వరకు పాల్గొంటున్నట్లు వివరించారు. శ్రీ వెంకటేశ్వర స్వామి వారు అందర్నీ ఆదుకునే దైవమని చెప్పారు. స్వామివారిని దర్శించడంలో కలిగే అనుభూతి మాటల్లో చెప్పలేమని అన్నారు. అన్ని వర్గాలవారు గోవింద యాత్రలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. 1400 కిలోల పసుపు, 700 కిలోల కుంకుమతో శ్రీవారి మెట్లకు పూజ చేయనున్నట్లు తెలిపారు. ఆరు నెలల నుంచి స్వామి వారి పాదయాత్రకు ప్రణాళిక రచన చేసినట్లు తెలిపారు. గోవింద యాత్ర సందర్భంగా ప్రదర్శించిన కోలాటాలు అందర్నీ ఆకర్షించాయి. శ్రీవారి మెట్టు మార్గం గోవింద నామ స్మరణలతో మారు మ్రోగింది. ఈ యాత్రలో పలు రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.



శ్రీవారి మెట్లకు పూజ చేసుకుంటూ వెళుతున్న భక్తులు

తిరుమలలో పోలీసుల మాక్ డ్రిల్



ప్రజాశక్తి - తిరుపతి డెస్క్ :తిరుమల సుదర్శన సత్రంలో ఆక్టోపస్ దళాలు గురువారం కవాతు నిర్వహించాయి. ఉగ్ర దాడులను ఎలా ఎదుర్కోవాలో మాక్ డ్రిల్ నిర్వహించి చూపారు. పహల్గామ్ ఉగ్రవాదులు జరిపిన నరమేధంతో పోలీసులు అలర్టయి ఈ మాక్ డ్రిల్ కార్యక్రమం నిర్వహించినట్లు సమాచారం. ఈ కార్యక్రమం బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాల ఆధ్వర్యంలో కొనసాగింది.

ఔషధి వనం ప్రారంభం



ప్రజాశక్తి - క్యాంపస్ : జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం వైస్-ఛాన్సలర్ ప్రొ.జి.ఎస్.ఆర్. కృష్ణమూర్తి 2025 ఏప్రిల్ 24న హెల్త్ సెంటర్ ప్రాంగణంలో "ఔషధి వనాన్ని ప్రారంభించారు. దాదాపు 70 ఔషధ మొక్కలను పేర్లతో సహా నాటారు. మెడిసినల్ గార్డెన్ను అభివృద్ధి చేసినందుకు ఆయుర్వేద కన్సల్టెంట్ డా.చిరంజీవి, సీనియర్ మెడికల్ ఆఫీసర్లు డా.బి.బాలదత్తాత్రేయ, డా.పి.శ్వేత, హెల్త్ సెంటర్ బృందాన్ని ప్రొ.కృష్ణమూర్తి అభినందించారు.

ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు



ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలం, పచ్చాలమ్మ కాలనీలో గురువారం ఇండస్ కాఫీ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ వారు ఏర్పాటుచేసిన ఆర్వో వాటర్ ప్లాంట్ను కంపెనీ డైరెక్టర్ హరేంద్రనాథ్ తర్పదార్, ఏజీఎం రమేష్ చేతుల మీదుగా ప్రారంభించారు. పచ్చాలమ్మ కాలనీకి చెందిన గాలి చెన్నకేశవ నాయుడు ఇండస్ కాఫీ కంపెనీ మేనకూరులో పనిచేస్తున్నాడు.చెన్నకేశవ తన ఊరికి ఆర్వో వాటర్ ప్లాంట్ అవసరం ఉందని కంపెనీ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లగా, వారు 10 లక్షల రూపాయల ఆర్థిక సహాయంతో ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసిన కంపెనీ యాజమాన్యానికి చెన్నకేశవ మరియు గ్రామస్తులు ధన్యవాదాలు తెలియపరిచారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సుధాకర్ నాయుడు, కన్నయ్య నాయుడు, ముని చంద్ర నాయుడు, మధు నాయుడు, కార్తీక్ నాయుడు, వీర రాఘవులు, పల్లమాల సర్పంచ్ రవణమ్మ, పచ్చాలమ్మ గుడి చైర్మన్ సురేష్ యాదవ్, గ్రామస్తులు మొదలగు వారు పాల్గొన్నారు.

ఎస్వీయుకు ప్రతిష్టాత్మక స్థానం

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర వేంకటేశ్వర విశ్వవిద్యాలయం 'ది టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఆసియా యూనివర్సిటీ ర్యాంకింగ్స్ - 2025' లో 600+ బ్యాండును చేరుకుని రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో తన ప్రతిభను మరోసారి చాటుకుంది. ఎస్వీయూ ఈ స్థానాన్ని చేరుకోవడం పట్ల ఇంచార్జ్ విసి ఆచార్య చిప్పాడ అప్పారావు ఆనందం వ్యక్తం చేశారు. విశ్వవిద్యాలయం విద్యా నైపుణ్యం, అంతర్జాతీయ దృశ్యమానతను, నిబద్ధతను తెలియజేస్తుందన్నారు. ఉన్నత విద్య, వివిధ పరిశోధనల ఆవిష్కరణలలో విశ్వవిద్యాలయ చేసిన నిరంతర ప్రయత్నాలకు ఈ విజయం ప్రతిబింబమని అన్నారు. ఈ గౌరవాన్ని తెచ్చిపెట్టిన అధ్యాపక సభ్యులు, పరిశోధకులు, పరిపాలనా సిబ్బంది, విద్యార్థులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

వైన్ షాప్ వద్ద ఉద్రిక్తత..
వ్యక్తిపై సీసాతో దాడి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ : చంద్రగిరి, ఇందిరమ్మ కాలనీ సమీపంలోని వైన్ షాప్ వద్ద ఒక వ్యక్తి ఇంకో వ్యక్తిపై బీర్ బాటిల్తో దాడి చేసిన ఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. వైన్ షాపుకు చెందిన వారు తనపై దాడి చేశారని బాధితుడు ఆరోపించాడు. సమాచారం అందకున్న పోలీసు ఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. కాగా గాయపడ్డ వ్యక్తి రాయలపురానికి చెందిన వ్యక్తి కావడంతో వైన్ షాప్ వద్దకు గుంపులు గుపులుగా గ్రామస్తులు చేరుకున్నారు. బాధితుడి తరఫున ఫిర్యాదు చేస్తే కేసు కడతామని చంద్రగిరి సీఐ సుబ్బరామిరెడ్డి తెలియజేశారు.